ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

3★★★ జిల్లా వార్తలు

సోమవారం 13 మే 2024



సిరిసిల్లలో సామగ్రి సరిచూసుకుంటున్న సిబ్బంది



వేములవాడలో తరలివెళ్తున్న సిబ్బంది



సిరిసిల్లలో సిబ్బందిని తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న వాహనాలు

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- అభ్యర్థుల భవిష్యత్ తేల్చనున్న ఓటర్లు
- సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయం పొడిగింపు
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4.72 లక్షల మంది ఓటర్లు
- భారీ బందోబస్తు
- జిల్లాలో 144 సెక్షన్ అమలు



సిరిసిల్ల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి తరలివెళ్తున్న సిబ్బంది



చందుర్తి మండలంలోని ఓ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సామగ్రి సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఓట్ల పండుగతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. పట్టణాల్లో ఉన్న ఓటర్లు తమ ఊళ్లకు చేరుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎండ వేడి ఎక్కువగా ఉండడంతో పోలింగ్ సమయాన్ని సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికల కమిషన్ పొడిగించింది. ఆదివారం సిరిసిల్ల, వేములవాడ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రితో యంత్రాంగం పల్లెల్లోకి చేరుకుంది. కలెక్టర్ అనురాగ్ జయంతి ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను పరిశీలించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ బందోబస్తును పర్యవేక్షించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 28 మంది అభ్యర్థులు పోటీ పడినా రెండు నియోజకవర్గాల్లో మాత్రం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే ప్రచార పోటీ కనిపించింది.

రెండు సెగ్మెంట్లలో 547పోలింగ్ కేంద్రాలు

సిరిసిల్ల, వేములవాడ రెండు శాసనసభ నియోజకవర్గాల్లో 547 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 287, వేములవాడ నియోజకవర్గంలో 260 కేంద్రాలు ఉన్నాయి. ఇందులో సమస్యాత్మంగా 58 పోలింగ్ కేంద్రాలు 48 సమస్యాత్మక ప్రాంతాలుగా పోలీసులు గుర్తించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా పోలీస్ బందోబస్తును పెంచారు.

3500 మంది పోలింగ్ సిబ్బంది

సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో ఎన్నికల నిర్వహణకు దాదాపు 3500 మంది సిబ్బంది భాగస్వాములు అవుతున్నారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్‌తోపాటు రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బంది తరలివెళ్లారు 547 పోలింగ్ కేంద్రాల్లో పీవోలు 652, ఏపీవోలు 652, ఓపీవోలు 1304 మంది, ఆరు మహిళా బృందాలు, రెండు యువజన బృందాలు, దివ్యాంగుల కోసం రెండు బృందాలు 56 మంది మైక్రో అబ్జర్వర్‌లు, 62 మంది సెక్టోరియల్ ఆఫీసర్లతోపాటు రూట్ ఆఫీసర్లు, నోడల్ అధికారులు, బీఎల్‌వోలతోపాటు ఇతర సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌తో పాటు సీసీ కెమెరాల నిఘా ఉంచారు. ఎన్నికల నిర్వహణకు బస్సులు, మినీ బస్సులు, కార్లు, కంటెయినర్‌లను ఉపయోగిస్తున్నారు.

1500 మందికి పైగా పోలీస్ సిబ్బంది

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహణలో ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ పర్యవేక్షణలో పోలింగ్ కేంద్రాలకు పోలీస్ సిబ్బంది తరలివెళ్లారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల పహారా ఏర్పాటు చేశారు. దాదాపు 1500 మందికి పైగా సిబ్బంది ఎన్నికల నిర్వహణలో బందోబస్తు నిర్వహించనున్నారు. 57రూట్ మొబైల్ బృందాలు, క్విక్ రియాక్షన్ బృందాలు 13, స్ట్రయికింగ్ ఫోర్స్ బృందాలు 6, రెండు ప్రత్యేక స్ట్రయికింగ్ బృందాలు, కేంద్ర బలగాలు, బందోబస్తు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో 144 సెక్షన్‌ను అమలుచేస్తున్నారు. ఎన్నికల కోడ్ సమయంలో పోలీసులు 82 లక్షల 11వేల 362 నగదును పట్టుకున్నారు. రూ.10.20 లక్షల విలువైన మద్యం పట్టుకున్నారు. గంజాయికి సంబంధించి 16 కేసులు నమోదు చేశారు. 9 కిలోల 209 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. 446 కేసుల్లో 1078 మందిని బైండోవర్ చేశారు. ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి 16 కేసులను నమోదు చేశారు. 23 ఆయుధాలను డిపాజిట్ చేశారు.

రెండు సెగ్మెంట్లలో 4.72 లక్షల మంది ఓటర్లు

జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో 4,72,735 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,27,840, మహిళలు 2,44,856, జెండర్‌లు 39 మంది ఉన్నారు. 17016 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,46,547 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,749 మంది మహిళలు 1,26,791 మంది ఉన్నారు. జెండర్ ఏడుగురు ఉన్నారు. ఇందులో మహిళలు 7042 మంది అధికం. వేములవాడ సెగ్మెంట్‌లో 2,26,188 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,08,091 మంది, మహిళలు 1,18,065 మంది ఉన్నారు. జెండర్ 32 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 9974 మంది అధికంగా ఉన్నారు.

పటిష్ట బందోబస్తు

- ఎస్పీ అఖిల్‌మహాజన్



జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో పారదర్శకంగా పోలింగ్ నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా పటిష్టమైన బందోబస్తుకు సంబంధించి ఏర్పాట్లు చేశామని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి బందోబస్తు విధులపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల బందోబస్తులో 1500 మంది సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి ప్రచారానికి వచ్చిన వారు స్థానికంగా ఉండవద్దన్నారు. లాడ్జింగ్‌లు, గెస్ట్‌హౌస్‌లు, హోటల్‌లలో బస చేస్తున్న ఇతర ప్రాంతాల వారు, రాజకీయ పార్టీల వారు ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ప్రశాంతంగా పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

కలెక్టర్ అనురాగ్ జయంతి

జిల్లాలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఆదివారం సిరిసిల్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, వేములవాడలో జడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండే విధంగా సూచనలు చేశారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బంది అప్పజెప్పాలని రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వ్ పోలింగ్ సామగ్రి సెక్టోరియల్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని సూచించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో 547 పోలింగ్ కేంద్రాలు, 4.72 లక్షల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన తాగునీరు, క్యూలైన్, టెంట్లు, టాయిలెట్లు, ఇతర వసతులు కల్పించినట్లు చెప్పారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ర్యాంప్‌లు, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశామన్నారు. వేసవి దృష్ట్యా ప్రతీ పోలింగ్ కేంద్ర వద్ద ప్రత్యేకంగా కూలర్లు ఏర్పాటు చేశామని, పారా మెడికల్ బృందాలు, మొబైల్ పారామెడికల్ బృందాలు ఏర్పాటు చేశామని అన్నారు. పోలీస్ బలగాలతోపాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద 50 శాతం కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ సౌకర్యం కల్పించామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు.



సిరిసిల్ల డిస్ట్రిబ్యూషన్‌కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ గౌతమి,

అకాల వర్షాలతో రైతన్న దిగాలు



ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

కోనరావుపేట, మే 12 : కోనరావుపేట మండలంలో వారం రోజులుగా ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఆరబోసిన ధాన్యం కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. మబ్బులు కమ్ముకుంటుండడంతో ఉదయం ఆరబోయడం, సాయంత్రం టార్పాలిన్లు కప్పుకోవడం వంటి పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం భారీ వర్షం పడడంతో ధాన్యం తడిసి ముద్దయ్యిందని వాపోయారు. మళ్లీ రాత్రిపూట వర్షం పడుతుందని ఆందోళనకు గురవుతున్నారు. వెంటవెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు పాటి దేవయ్య తల్లి రామవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. నాయకులు దేవరెడ్డి, రమేశ్, సుభాష్ తదితరులు ఉన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ టౌన్, మే 12: వేముల వాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. గండదీపంలో నూనె పోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాల్లో కుంకుమపూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

కరీంనగర్ నియోజకవర్గ స్వరూపం

విస్తరించి ఉన్న జిల్లాలు

- కరీంనగర్ (పూర్తిగా..), రాజన్న సిరిసిల్ల (రుద్రంగి మండలంలోని మానాల గ్రామం తప్ప)
- జగిత్యాల, సిద్దిపేట, హన్మకొండ జిల్లాల్లోని కొన్ని మండలాలు

మండలాలు

- రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, వీర్నపల్లి, ఇల్లంతకుంట, బోయినపల్లి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి, రుద్రంగి (ఈ మండలంలోని మానాల గ్రామం నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో ఉంది)
- సిద్దిపేట జిల్లా నుంచి బెజ్జంకి, కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాలు
- హన్మకొండ జిల్లా నుంచి కమలాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాలు
- జగిత్యాల జిల్లా పరిధిలోని మల్యాల, కొడిమ్యాల, కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాలు

పోలింగ్ స్టేషన్లు

- మొత్తం పోలింగ్ స్టేషన్లు 2,194
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 288
- పోలింగ్‌కు 13,635 మంది అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నారు.



జనాభా

- కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో 23.83 లక్షల జనాభా ఉంది.

ఓటర్లు

- మొత్తం ఓటర్లు: 17,97,150
- పురుషులు: 8,77,483
- మహిళా ఓటర్లు: 9,19,565
- ట్రాన్స్ జెండర్లు: 102
- పీడబ్ల్యూడి 41,718 ఓటర్లు
- 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 13,780

మాతృమూర్తులకు ఘన సన్మానం



మళయాళ సద్గురు గీతామందిరంలో సన్మానం

కరీంనగర్ కల్చరల్, మే12: ఆది శంకరాచార్యులు, భగవద్రామానుజుల జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గీతాభక్త సమాజం సభ్యులు మఠాధిపతి విష్ణుసేవానందగిరిస్వామికి పాదపూజ చేశారు. స్వామీజీ ప్రవచనం చేస్తూ రామానుజ, శంకరాచార్యుల వైభవాన్ని, మాతృ మూర్తుల ప్రాశస్త్యాన్ని వివరించారు. మహిళా దినోత్సవంలో భాగంగా 62 మంది మాతృమూర్తులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో సమాజం అధ్యక్షుడు బండ సత్తయ్య, కార్య నిర్వాహకుడు పుప్పల రామేశం, సభ్యులు గుండ రాధాకిషన్, వేంకటయ్య, దామోదర్, భూపతి, గంగన్న, రవీందర్, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల గాలివాన.. ప్రజల ఇబ్బందులు



కంచర్లలో విరిగిపడిన కరెంటు స్తంభం



చందుర్తి మండలంలో మృతి చెందిన ఆవు వద్ద రైతు మల్లారెడ్డి

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసింది. సుమారు గంటపాటు గాలివానకు మండల కేంద్రంతోపాటు, అక్కపల్లి, తిమ్మాపూర్, గుండారం తదితర గ్రామాల్లో చెట్లు నేలకూలాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా స్థానికులు, యువకులు చెట్లను తొలగించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. ధాన్యం కుప్పలపై ప్లాస్టిక్ కవర్ల కప్పారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చిన ధాన్యం తూకం వేయడంలో నిర్లక్ష్యం వల్ల ఒక్కసారిగా వచ్చే వానకు తడిసిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు.

వీర్నపల్లిలో విరిగిపడిన స్తంభాలు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు కంచర్ల గ్రామంలో ఆదివారం ఈదురుగాలులతో కూడిన గాలివానకు కరెంటు స్తంభాలు నెలకొరిగాయి. పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఈదురుగాళ్లకు టార్పాలిన్ కవర్లు ఎగిరిపోవడంతో వరి ధాన్యం తడిసింది. కొన్నిచోట్ల తూకం వేసిన ధాన్యం బస్తాలు తడిశాయి. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతుల కోరుతున్నారు.

పిడుగుపాటుతో ఆవు మృతి

చందుర్తి: మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో పాటు పిడుగు పడటంతో మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఓ ఆవు మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పూడూరు మల్లారెడ్డి చెందిన ఆవు పిడుగు పడి మృతి చెందింది. ఆవు విలువ దాదాపు రూ 50 వేలు ఉంటుందని, బాధిత రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

కొడిమ్యాల మండలంలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలో ఆదివారం మధ్యాహ్నం స్వల్పంగా వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ప్రజలకు ఉక్కపోత నుండి ఉపశమనం లభించింది. అరగంట సేపు వీచిన ఈదురు గాలులకు కోనాపూర్ నుంచి కొడిమ్యాలకు వచ్చు దారిలో చెట్టు నేల కూలింది, తిర్మాలాపూర్ గ్రామంలో వీచిన ఈదురు గాలులకు అదె గ్రామానికి చెందిన తైదల అంజయ్య, శాంతయ్యకు చెందిన ఇళ్ల రేకులు లేచిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, మే 12: నిన్న మొన్నటి వరకు భానుడి ప్రతాపంతో భగభగమన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఆదివారం సాయంత్రం కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ఆదివారం పగలు 40.5డిగ్రీల ఉష్ణోగత నమోదు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 28.0డిగ్రీలు నమోదయింది. మే లో భానుడు ప్రతాపం చూపగా ఆదివారం కురిసిన వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. ఎన్నికల నేపథ్యంలో ఆయా పోలింగ్ సెంటర్లకు ఈవీఎంలు చేరిన తరువాత వర్షం పడడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కొడిమ్యాలలో లేచి కింద పడిన రేకులు



కొడిమ్యాలలో విరిగిపడిన చెట్టు



గోదావరిఖనిలో కురుస్తున్న వర్షం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



కరీంనగర్‌లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రంను పరిశీలిస్తున్న సీపీ



ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, మే 12: కమిషనరేట్ వ్యాప్తంగా ఉన్న పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే అందుబాటులో వుండే సమీప అధికారులకు తెలియజేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

● డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల సందర్శన

కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సిరిసిల్ల బైపాస్ రోడ్డులో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సీపీ అభిషేక్ మొహంతి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతోపాటు అన్ని వర్గాల ప్రజలతో సిబ్బంబది సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాంలోకి వెళ్లవద్దని, వారు పిలిస్తేనే వెళ్ళాలని సూచించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా కృషి చేయాలన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

కరీంనగర్ క్రైం, మే 12 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ఆదివారం రాత్రి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పట్టణంలోని లాడ్జిలు, హోటల్లలో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. లోకసభ ఎన్నికలకు పోలింగ్ ప్రక్రియ మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుండగా, రాత్రి సమయంలో అక్రమ డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీలను అరికట్టేందుకు విస్తృతస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలింపు



కనగర్తి చెరువులో అక్రమంగా మట్టి తరలించగా ఏర్పడిన గొయ్యి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామానికి చెందిన చెరువులో ఇష్టారాజ్యంగా చెరువు మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెరువులోని మట్టిని గృహాలకు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై మండలాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ చైర్మన్ బండి మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కనగర్తి గ్రామ చెరువులో అక్రమంగా మట్టిని తోడిన ప్రాంతాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కనగర్తి గ్రామానికి చెందిన చెరువులు, కుంటలలోని మట్టిని అమ్ముకుంటూ అధికారులు, రాజకీయ పార్టీ నాయకులకు ముడుపులు అప్పచెప్పుతూ చెరువులను అన్యాక్రాంతం చేస్తున్నారన్నారు. చెరువుల్లో మట్టిని తీసే జేసీబీ, ట్రాక్టర్లకు సరైన పత్రాలు లేవని గ్రామాల్లో విచ్చలవిడిగా అక్రమ మట్టి మాఫియా కొనసాగుతుందన్నారు. ప్రతి సంవత్సరం ఎండకాలం వచ్చిందంటే చెరువులో నీరు ఎండిపోగానే మట్టి తవ్వకాలకు తెరతీస్తూ గ్రామంలో ఉన్న చెరువులను పనికి రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వాధికారులు స్పందించి చెరువులను కాపాడాలని ఇల్లందకుంట మండల ప్రజలు కోరుతున్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి గల్లంతు

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఆలకుంట రాజు(35) గ్రామ శివారులోని కొత్తకుంట చెరువులో చేపల వేటకు వెళ్లి ఆదివారం రాత్రి గల్లంతు అయ్యాడని కుటుంబ సభ్యులు, పోలీసుల తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు స్థానికుల సహాయంతో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని రాజు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఆదివారం రాత్రి చేపల వేటకు మరో వ్యక్తితో కలిసి వెళ్లిన అతను చీకటి పడిన ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కొత్తకుంట వద్దకు చేరుకున్నారు. గట్టున బట్టలు, చెప్పులు కనిపించడంతో నీటిలో మునిగిపోయాడని రాజుతో వెళ్లిన వ్యక్తి పేర్కొంటున్నాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, కొత్తకుంటలో రాజు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఓ వైపు చీకటి ఉండడం.. మరో వైపు వర్షం కురవడం వల్ల గాలింపునకు ఆటంకం ఏర్పడింది. భార్య సునీత, తల్లిదండ్రులు నర్సవ్వ, లింగయ్య, కొడుకు అక్కడకు చేరుకుని భోరున విలపిస్తున్నారు. సోమవారం గాలింపు చర్యలు చేపడుతామని పోలీసులు వివరించారు.

వడదెబ్బతో మహిళ మృతి

శంకరపట్నం, మే 12: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన కనుకుట్ల రాధా (40) అనే మహిళ ఆదివారం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రెండ్రోజు లుగా ఎండ తీవ్రత ఉద్రిక్తంగా ఉండడంతో తట్టుకోలేక అస్వస్థతకు గురై మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం

● నిబంధనలు పాటిస్తేనే మేలు ● ఓటు హక్కు వినియోగానికి ఈసీ ఏర్పాట్లు ● నేడు లోక్‌సభ ఎన్నికల పోలింగ్

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుకే ప్రాధాన్యం దక్కుతుంది. ఓటు హక్కు వినియోగానికి ఎన్నికల సంఘం అమలు చేస్తున్న నిబంధనలను పాటిస్తేనే ప్రయోజనం చేకూరుతుంది. అర్హులందరూ ఓటు వేసేలా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఓటు సాధారణంగా అందరికీ ఒకేలా ఉంటుంది. కానీ అదే ఓటును కొన్ని సమయాల్లో వేరే పేరుతో పిలుస్తారు.

● జాబితాలో పేరు లేకుంటే..

ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకోవాలంటే ఓటరు జాబితాలో తప్పనిసరిగా పేరు ఉండాల్సిందే. ఒకవేళ పేరు లేకుంటే ఓటు హక్కు వినియోగానికి అనర్హుడు. ఓటరు తన ఓటు ఏ పోలింగ్ బూత్‌లో ఉందనేది అందుబాటులో ఉండే బీఎల్‌వోల ద్వారా తెలుసుకోవాలి. బీఎల్‌వోలు ఇచ్చిన ఓటరు స్లిప్ వెనుకాల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పోలింగ్ కేంద్రం సమాచారం లభిస్తుంది.

● టెండర్ ఓటుకు అవకాశం

ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన వ్యక్తి అప్పటికే వేరే వ్యక్తి తన ఓటును వినియోగించుకున్నాడని తెలిస్తే సదరు ఓటరు ఎన్నికల నిబంధనల మేరకు 49-ఏ ప్రకారం టెండర్ ఓటేసే అవకాశం ఉంటుంది. ఈ ఓటు వేసే వ్యక్తి ఈవీఎంల ద్వారా వేయడానికి వీలులేదు. బ్యాలెట్ రూపంలో ఓటు వేసే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన ప్రక్రియ పీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఏపీఓ, అభ్యర్థుల పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓటరు జాబితాను చెక్ చేసుకుంటారు. ఇప్పుడున్న పరిస్థితిలో దొంగ ఓట్లు వేసే అవకాశం లేదు. జిల్లాలో ఎక్కడా టెండర్ ఓటు నమోదు కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● వీరికే అనుమతి

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి ఏజెంట్‌లకు అవకాశం ఉంటుంది. ఓటరుతో పాటు పసిపిల్లలకు అవకాశం ఉంది. పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్స్, సెక్టోరల్ అధికారులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన విలేకరులు, ఈసీఐ ద్వారా అనుమతి పొందిన ఇతరులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు అవకాశం ఉంటుంది.



● వీవీ ప్యాట్‌తో

ఈవీఎంల ద్వారా ఓటు వేస్తే ఓటు పడుతుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అందుకే ఎన్నికల సంఘం వీవీ ప్యాట్ యంత్రాల ద్వారా సమస్యకు పరిష్కారం చూపింది. వీవీప్యాట్ తెరపై ఓటరు వేసిన గుర్తు కనబడుతుంది. దానితో ఓటరు తాను వేసిన ఓటును నిర్ధారించుకుంటారు. వేసిన ఓటు వీవీ ప్యాట్‌పై కనబడితే పారదర్శకంగా ఓటు వేసినట్లు లెక్క. లేకుంటే పీఓకు ఫిర్యాదు చేయాలి.

● నిబంధనలు పాటించాల్సిందే

ఓటు హక్కును వినియోగించుకునేవారు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల గుర్తులు, కండువాలు, వస్త్రాలను ధరించవద్దు. సెల్‌ఫోన్లను తమ వెంట తీసుకెళ్లకూడదు. ఓటు హక్కు వినియోగానికి పోల్ స్లిప్ ప్రమాణికం కాదు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 16 ధ్రువ పత్రాలలో ఏదైనా ఒకటి తీసుకెళ్తే ఓటు వేసేందుకు అవకాశం ఉంది.

● ఓటింగ్ ప్రక్రియ ఇలా..

ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి (పీవో), అదనపు ప్రిసైడింగ్ అధికారి (ఏపీఓ) ఇద్దరు ఇతర పోలింగ్ అధికారులు (ఓపీఓ) విధులు నిర్వహిస్తారు. ఓటర్లు వీరికి సహకరించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. మొదట ఏపీఓ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి పేరును పోలింగ్ కేంద్రంలోని ఓటరు జాబితాలో ఉంటే ఓటరు గుర్తింపు, క్రమసంఖ్య పేరు గట్టిగా చదివి వినిపిస్తారు. అభ్యర్థులకు సంబంధించిన ఏజెంట్లు సరేనని ఒప్పుకుంటే ఓటరు ఎడమ చేతి చూపుడు వేలును చెక్ చేస్తారు. ఓపీఓ-1 మూడు బాధ్యతలు (ఓటరు సిరా చుక్క వేయడం, 17ఏ రిజిస్టార్‌లో పేరు నమోదు, ఓటరు స్లిప్ రాయటం) నిర్వహిస్తారు. దీని తర్వాత ఏపీఓ-2 దగ్గరకు వెళితే పోల్ స్లిప్ తీసుకొని కంట్రోల్ యూనిట్ (సీయూ)లో బటన్ నొక్కి ఓటేసే అవకాశం కల్పిస్తారు. ఓటరు ఓటు వేసే ప్రదేశానికి వెళ్లి ఓటు వేసి బయటకు రావాల్సి ఉంటుంది. ఇలా ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది.

● సందేహాలు ఉంటే పీవోకు ఫిర్యాదు చేయాలి

ఓటరుకు ఏమైనా అనుమానాలు, సందేహాలు ఉంటే ప్రిసైడింగ్ అధికారి (పీఓ) కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విధానాన్ని పీఓ పర్యవేక్షించి రెండు గంటకొకసారి నమోదు అయిన పోలింగ్ వివరాలను సెక్టోరియల్ ఆఫీసర్‌కు సమాచారం అందిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్స్‌లు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత

కరీంనగర్ టౌన్, మే 12: పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సుల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇటీవల పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉద్యోగులు వినియోగించుకోగా, బ్యాలెట్ పత్రాలను, హోం ఓటింగ్ బ్యాలెట్ బాక్స్‌లను కలెక్టరేట్‌లో భద్రపరిచారు. కలెక్టరేట్‌లో భద్రపరిచిన బ్యాలెట్ బాక్స్‌లు రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఆదివారం రాత్రి కలెక్టరేట్ నుంచి ప్రత్యేక వాహనంలో ఎస్సారార్ డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌కు పోలీస్ బందోబస్తు మధ్య తరలించారు. స్ట్రాంగ్‌కు తరలించే ప్రక్రియను కలెక్టర్ పమేలా సత్పతి, పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ అమిత్ కటారియాతో కలిసి పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటలపాటు బందోబస్తు ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో మహేశ్వర్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, పరిశ్రమల శాఖ జీఎం నవీన్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, సయ్యద్ బర్కత్ అలీ, కళ్యాడపు ఆగయ్య, రాజేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి ఉత్సవాలు

ధర్మపురి, మే 12: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేళలో ఆలయంలోని శంకరాచార్యులకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు పంచోపనిషత్తులతో రుద్రాభిషేకం, హారతి మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భగవద్రామానుచార్యా జయంతి పురస్కరించుకుని ప్రధాన దేవాలయాల్లో గల అభిషేక మండపంలో రామానుజాచార్యా జయంతి వేడుకల్లో భాగంగా షోడశోపచార పూజ, పంచామృత అభిషేకం సూక్త పారాయణంతో, అష్టోత్తర శతనామ పూజ దివ్య ప్రభంద పారాయణం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వేదపండితులు మదు శంకర్‌శర్మ, సంగనభట్ల దిలీప్‌శర్మ, గుండి శ్రీనాథ్‌శర్మ, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, జూనియర్ అసిస్టెంట్ దేవయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాలులో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఉన్నారు.



ధర్మపురి శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు

కథలాపూర్ : అద్వైత సిద్ధాంత బోధకుడిగా, హిందువులకు నిత్య స్తోత్రాలను అందించిన జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు మండలంలోని సిరికొండలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యువకులు ఆది శంకరాచార్యుని చిత్రపటంకు పూలమాలలు వేసారు. సనాతన ధర్మం బలోపేతం చేయడానికి కాళికా, గోవర్ధన, శారదా, జ్యోతిర్మఠాలను స్థాపించిన ఘనత శంకరాచార్యునికే దక్కిందన్నారు. 108 స్తోత్రాలు, గ్రంధాలు రచించిన శంకరాచార్యున్ని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంచాల మధుసూదన్, దొమ్మాటి గంగనర్సయ్య, అల్లె గంగాధర్, కాశోజి భాస్కర్, నాంపల్లి శ్రీధర్, గట్ల మహేశ్, లస్మయ్య, కృష్ణ, రమేశ్ తదితరులు ఉన్నారు.

పోలింగ్‌కు సిద్ధం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పోలింగ్‌కు అధికారులు అంతా సిద్ధం చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి బందోబస్తు మధ్య పోలింగ్ స్టేషన్లకు ఆదివారం రాత్రి వరకు ఈవీఎంలతో ఎన్నికల సిబ్బంది తరలివెళ్లారు.



రామగుండం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



పెద్దపల్లిలో ఎన్నికల విధులకు తరలుతున్న సిబ్బంది



సిరిసిల్లలో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కోరుట్లలో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది



కరీంనగర్‌లో సామగ్రితో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

పవర్‌లూం కార్ఖానాలో అగ్నిప్రమాదం



పవర్‌లూం కార్ఖానాలో మంటలను ఆర్పుతున్న సిబ్బంది

సిరిసిల్ల క్రైం, మే 12: సిరిసిల్ల పట్టణంలోని బివైనగర్‌లో అంబటి వేణు పవర్‌లూం కార్ఖాణాలో ఆదివారం తెల్లవారుజామున 2 గంటలకు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన రూ 2.50 లక్షల ముడి సరుకు దగ్ధమైంది. పవర్‌లూం కార్ఖాణాలో అగ్నిప్రమాదం సంఘటనను వెంటనే స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు తెలియజేయడం వల్ల అగ్నిమాపక యంత్రంతో ఫైర్‌మెన్‌లు సాబీర్, నాగరాజు, నవీన్‌కుమార్‌లు సంఘటనా స్థలానికి సకాలంలో చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే వస్త్ర ఉత్పత్తికి సంబంధించిన ముడిసరుకు కాలిబూడిదైంది. పవర్‌లూం కార్ఖాణాలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అగ్నిమాపక ఇంచార్జి అధికారి టి. నర్సింహాచారి తెలిపారు.

వైభవంగా పార్వతీ కోటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వెల్గటూర్, మే 12: వెల్గటూరు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటిలింగాలలో గోదావరి తీరాన కొలువై ఉన్న శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన కల్యాణ మంటపంపైన అమర్చిన పీఠంపై స్వామివారల ఉత్సవ విగ్రహాలను నిలిపారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మ, కార్తీక్, శివకిరణ్‌ల మంత్రోచ్ఛరణల మధ్య వైశాఖ శుక్ల పంచమి శంకర జయంతి సందర్భంగా ఆరుద్ర నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు. మహిళ భక్తులు స్వామి వారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం రేగొండ వైకుంఠం కళావతి, రేగొండ రామన్న మల్లీశ్వరి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కార్యనిర్వహాధికారి కాంతారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మానకొండూర్, మే 12: మండలంలోని దేశ్‌రాజ్‌పల్లిలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలు అయినట్లు ఎస్ఐ సురేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతి (39) అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనానికి ట్రాక్టర్‌లో శనివారం రాత్రి బయలుదేరారు. రామడుగు మండలంలోని దేశ్‌రాజ్‌పల్లి ఎక్స్ రోడ్డు వద్ద ట్రాక్టర్ వెనకాల వస్తున్న కారు ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తిరుపతి, అతనికి ఇరువైపులా కూర్చున్న కాడే జస్వంత్, తీట్ల విష్ణువర్ధన్ కిందపడిపోగా ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం డ్రైవర్ తిరుపతి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణలో ముగ్గురికి గాయాలు

కోరుట్ల, మే 12: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయలయినట్లు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన దినేష్ జాట్, ఈరాంజాట్, నాన్‌రాంజాట్ కోరుట్ల పట్టణంలో ఐస్‌క్రీం వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరి వద్ద ఈశ్వర్ జాట్, రాజేష్ జాట్‌లు పనిచేసేవారు. ఇటీవల ఈశ్వర్ జాట్, రాజేష్‌జాట్‌లు స్వంతంగా ఐస్‌క్రీం వ్యాపారం చేపట్టారు. ఈ క్రమంలో మిగతా ముగ్గురితో విభేదాలు వచ్చాయి. శనివారం అర్ధరాత్రి వీరి మధ్య గొడవ చోటు చేసుకుంది. దీంతో ఈశ్వర్ జాట్, రాజేశ్వర్ జాట్‌లు దినిష్‌జాట్, ఈరాంజాట్, నాన్‌రాంజాట్‌లపై దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట,మే12:పట్టణంలోని కొత్తపల్లికి చెందిన కల్లెపల్లి వెంకట రత్నం (45) గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెంకటరత్నం టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. రైల్వే స్టేషన్‌కు దగ్గరలోని ఇంటికి వెళ్తుండగా రెండవ ప్లాట్ ఫాం దగ్గర గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో మృతి చెంది ఉంటాడని తెలిపారు. రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.మృతునికి భార్య సుకన్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్య

ధర్మపురి, మే 12: పట్టణానికి చెందిన నూనె సత్యనారాయణ(35) అనే యువకుడు గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సత్యనారాయణ ఇంటిలో ఈనెల 11న మధ్యాహ్నం గొడవపడి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ గురించి వెతికారు. ఆదివారం ఉదయం ధర్మపురికి చెందిన కొందరు జాలర్లు గోదావరి నది బ్రహ్మగుండం నీటిలో మృతదేహం ఉందని తెలిపారు. కుటుంబ సుభ్యులు వెళ్లి మృతదేహం సత్యనారాయణదిగా గుర్తించారు. ఇంట్లో గొడవ పడి ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి అన్న నూనె శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

● జగిత్యాల జిల్లాలో రూ. 3.97 కోట్ల నగదు స్వాధీనం

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా నగదు, లిక్కర్, బంగారాన్ని పోలీసులు, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ వరకు సుమారు రూ. 3,97,36,336 విలువ గల నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో రూ. 2,21,53,310 నగదు ఉంది. అదేవిధంగా సుమారు రూ. 14,43,015 విలువ గల సుమారు 2,769 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 67,45,011 విలువ ఇతర సామగ్రిని సీజ్ చేశారు. రూ. 90 లక్షల విలువల గల 1.506 కేజీల బంగారం, రూ. 3.95 లక్షల విలువ గల 15.81 గంజాయి పట్టుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 612 మంది వ్యక్తులను బైండోవర్ చేశారు. 45 ఆయుధాలు డిపాజిట్ చేశారు.

మద్యం పట్టివేత

రాయికల్, మే12: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టగా వాహనంలో రెండు మద్యం కాటన్ బాటిళ్లు పట్టుబడ్డాయి. ఇందులో 96 రాయల్ స్టాగ్ 17 లీటర్ల మద్యం పట్టుబడినట్లు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద మద్యాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ వన్ జి.కృష్ణారెడ్డి, ఏఆర్ ఎస్సై విద్యాసాగర్, కానిస్టేబుల్ రాహుల్ ఉన్నారు.

వైభవంగా రామానుజుల జయంతి

ఇల్లందకుంట, మే 12: ఇల్లందకుంట శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల 1007 జయంతి వేడుకలు ఆదివారం రాత్రి గ్రామ దేవాలయంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రామానుజుల స్వామివారి ఉత్సమూర్తును ఘనంగా అలంకరించి, పల్లెకిలో అసీనులను చేసి బాజాభజంత్రిలు, మేళాతాళాలు నడుమ గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పల్లెకి సేవలో పాల్గొని పునకింతులయ్యారు.



రామానుజు స్వామివారికి పల్లకి సేవ

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ



పనులు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

గణేష్‌నగర్, మే 12: కరీంనగర్ డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించారు. కరీంనగర్ సర్కిల్‌లోని రూరల్ డివిజన్ గుండిలో 15 కెవిఎ డిటీఆర్‌ను లారీ ఢీకొట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రుద్రారం, రంగసాయిపల్లిలో విద్యుత్‌ను పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ రూరల్ మండలం సిటిజన్ కాలనీలో 100 కెవిఎ ఓల్డ్ డీటీఆర్‌లో ఇంటర్నల్ సమస్యతో చెడిపోవడంతో తక్షణమే డీటీఆర్ ఏర్పాటు చేశారు. హుజూరాబాద్ డివిజన్ జమ్మికుంటలో గాలి దుమారంతో రెండు 8 మీటర్స్ పోల్స్ పడిపోవడంతో అధికారులు తక్షణమే స్పందించి పునరుద్ధరించారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నంబర్ 9440811444కు ఫోన్ చేయాలన్నారు. ఈకార్యక్రమంలో డీఈ రూరల్ తిరుపతి, లక్ష్మారెడ్డి, ఏడీఈలు, సత్యనారాయణరెడ్డి, రాజేందర్, ఏఈలు తిరుపతి, శంకరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

లాడ్జిలో ప్రింటింగ్ మిషన్

● పోలీసుల విచారణ

కరీంనగర్ క్రైం, మే 12: కరీంనగర్ బస్టాండ్ సమీపంలోని ఒక లాడ్జిలో ఆదివారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీలలో ఒక ప్రింటింగ్ మిషన్‌తో ఉన్న వ్యక్తులను పోలీసులు విచారించారు. ఓ పార్టీకి చెందిన వారు పోలింగ్ చిట్టీలను ముద్రించేందుకు ఆ ప్రిటింగ్ మిషన్ కలిగిఉన్నట్లు విచారణలో వెల్లడైందని సీఐ సరిలాల్ తెలిపారు. కాగా లాడ్జిలో ఈవీఎం దొరికిందని ప్రచారం జరిగింది. దీనిని తప్పుడు ప్రచారంగా పోలీసు అధికారులు పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, మే 12: ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మనకు ఇచ్చిన ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకొనట్లయితే ప్రజాస్వామ్యంలో మనం ఉండి లేనట్లే.. అని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం చెబుతున్నట్లు దయచేసి ప్రతి ఓటరు రేపు సెలవు అని భావించకుండా సామాజిక బాధ్యతగా భావించి హక్కు ను వినియోగించుకోవాలని కోరారు.

పలువురితో మంత్రి మాటామంతి

సిరిసిల్ల టౌన్ మే 12: బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ ఆది శ్రీనివాస్ ఆదివారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద దుకాణా యజమానులను ప్రజలను కలిసి ముచ్చ టించారు. ఓ హోటల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ టీ తయారు చేయగా మంత్రి పొన్నం ప్రభాకర్ టీ తాగుతూ ఆస్వాదించారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, రెడ్యా నాయక్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ బైక్‌రైడ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వేములవాడకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సాయంత్రం సరదాగా తిప్పాపూర్ బస్టాండు నుంచి స్వయంగా బైక్ నడుపుతూ ప్రజలను ఆకట్టుకున్నారు. మంత్రి నడుపుతున్న బైక్‌పైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూర్చున్నారు. అనంతరం పట్టణంలోని ఓ టీ స్టాల్‌లో టీ తాగుతూ ముచ్చటించారు.

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి



పారాయణం చేస్తున్న భక్తులు

సిరిసిల్ల రూరల్, మే 12: సిరిసిల్ల పట్టణంలోని విశ్వనాథ స్వామి ఆలయంలో ఆదివారం ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గీతా ప్రచార సేవా సమితి, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆది శంకరాచార్యుల జయంతి సందర్భంగా భగవద్గీత పారాయణం, శంకరాచార్యుల విరచితమైన భజగోవిందం, భజగోవిందం శ్లోకాల పారాయణం, ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కోడం నారాయణ, కార్యదర్శి జనపాల శంకరయ్య, ఎనుగుల ఎల్లయ్య, ఆలయ కమిటీ చైర్మన్ దూస శ్రీనివాస్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో మదర్స్‌డే వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వృద్ధులు

తంగళ్లపల్లి, మే 12: తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామ శివారులోని వృద్ధుల ఆశ్రమంలో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం, ప్రకృతి ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ సంయుక్తంగా ప్రభుత్వ వయో వృద్ధుల ఆశ్రమం, డే కేర్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఆదివారం మదర్స్‌డే సందర్భంగా వృద్ధులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వృద్ధుల ఆశ్రమం కో ఆర్డినేటర్ మమత, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



బీజేపీలో చేరుతున్న యువకులు

కోనరావుపేట, మే 12 : కోనరావుపేట మండలం కొలనూరు గొల్లపల్లికి చెందిన పలువురు యువకులు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గొట్టే రామచంద్రం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీజేపీలో చేరికలు పెరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలనూరు ఎంపీటీసీ ప్రవీణ్, గొల్లపల్లి యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

వీర్నపల్లి, మే 12 : వీర్నపల్లి మండల కేంద్రంలో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ బైక్ పై తిరుగుతూ బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ జోగినిపల్లి రాజేశ్వరరావు, ప్యాక్స్ డైరెక్టర్ జోగినిపల్లి నాగేశ్వరరావు తల్లి భాగ్యలక్ష్మి, వార్డు సభ్యుడు కముటం రజనీకాంత్ నానమ్మ ఎల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావుతో కలిసి పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ గుగులోతు కళావతి, ఎంపీపీ మాలోతు భూల, మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



వీర్నపల్లి పోలింగ్ కేంద్రానికి వస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట మే12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఎల్లారెడ్డిపేట మండలంలోని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వానకు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టెంట్లు కూలిపోయాయి. ప్రత్యేక పోలీసు బలగాలు భారీ భద్రత చర్యలు చేపట్టారు. మండలంలోని 24 గ్రామాలకు 20 గ్రామాల్లో ఎన్నికల అధికారులు 50 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. మండల కేంద్రంతోపాటు గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు. మొత్తం 40,350 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పురుషులు 19,449, మహిళలు 20,901 మంది ఓటును వేయనున్నారు. ఆరుగురు సెక్టార్ అధికారులు, ఆరుగురు రూట్ అధికారులు, 200 మంది పోలింగ్ అధికారులు, 250 మంది సహాయకులు విధులు నిర్వర్తించనున్నారు. కేంద్ర బలగాలు, స్థానిక సీఐ, ఎస్ఐలతో పాటు ఇద్దరు ఇన్‌చార్జీ సీఐలు, ఇద్దరు ఇన్‌చార్జి ఎస్ఐలు, 7 రూట్ మొబైల్ టీంలు, 100 మంది పోలీసు సిబ్బంది ఎన్నికలకు బందోబస్తు నిర్వహించనున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలంలోని 16 పోలింగ్ కేంద్రాలలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండడంతో ఈవీఎంలతో సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని సెక్టార్ అధికారులు జ్యోతి, జనార్దన్ కోరారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

తంగళ్లపల్లి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు తంగళ్లపల్లి మండలంలోని పోలింగ్ స్టేషన్లను సిబ్బంది చేరుకున్నారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీలు ఉండగా 50 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. మొత్తం మండలంలో 38 వేల 784 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మీ తెలిపారు. పోలింగ్ స్టేషన్లలో సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఇల్లంతకుంట: లోకసభ ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలో 40,067మంది ఓటర్లు ఉండగా 19,465మంది పురుషులు, 20వేల 602మంది మహిళలు ఉన్నారు. 33 గ్రామపంచాయతీలకు 58 పోలింగ్ బూత్‌లను ఐదు సెక్టార్లుగా విభజించినట్లు తహసీల్దార్ జావెద్ అహమ్మద్ తెలిపారు. ప్రతీ ఒక్కరు నిర్భంయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కోనరావుపేట: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అన్ని గ్రామాల పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది ఆదివారం చేరుకున్నారు. కోనరావుపేట మండలంలో 28 గ్రామాలు ఉండగా 43 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎగ్లాస్‌పూర్‌లో మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎలాంటి సంఘటన జరగకుండా అన్ని పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లతోపాటు అన్ని మౌలిక వసతులు కల్పించారు.

చందుర్తి: కరీంనగర్ పార్లమెంటు స్థానానికి సోమవారం పోలింగ్ జరగనుండడంతో యంత్రాంగం భద్రత కట్టుదిట్టం చేసింది. ఆదివారం సిబ్బంది నిర్దేశిత కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. మొత్తం 33 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

● మండలంలోని ఎనగల్, బండపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఏఎస్పీ చంద్రయ్య ఆదివారం రాత్రి పరిశీలించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

రుద్రంగి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం జరిగే ఎన్నికలకు రుద్రంగి మండల కేంద్రానికి ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. మండల కేంద్రంలో 7 బూత్‌లు ఉండగా 8466 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.



వేములవాడలో సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



రుద్రంగిలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ చంద్రయ్య

చివరి ఓటు వరకు జాగ్రత్తలు తీసుకోవాలి

వేములవాడ టౌన్, మే 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా రెండు నెలల నుంచి కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేస్తున్నారని, సోమవారం సాయంత్రం చివరి ఓటు పడే వరకు జాగ్రత్తగా ఉండాలని బూత్ లెవల్ ఏజెంట్లకు సూచించారు. వేములవాడ పట్టణంలోని నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు శక్తిమించి పని చేశారన్నారు. వారందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చివరి రోజున సోమవారం పూర్తిగా ఎన్నికలు ముగిసే వరకు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేరవేర్చాలని సూచించారు. ఓటరు లిస్టులో పేర్లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, శ్రీనివాస్, పాత సత్యలక్ష్మి, బొజ్జ భారతి, తోట లహరి, కూతడి రాజేశం తదితరులు ఉన్నారు.



ఏజంట్లకు సూచనలు ఇస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ధర్మాన్ని రక్షించండి.. ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడండి

- ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 12: ధర్మాన్ని రక్షించాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఓటర్లకు ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా, నిష్పక్షపాతంగా ఓటు వేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, మీరు కోరుకునే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం అధికారులు సైతం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగాఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● ఏరులై పారుతున్న డబ్బు, మద్యం

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో డబ్బు, మద్యం ఏరులై పారుతోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ఓ ప్రకటనలో విమర్శించారు. అధికార పార్టీ కాంగ్రెస్ ఇంటింటి డబ్బు, మద్యం పంపిణీ చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఓటుకు వెయ్యి రూపాయలు, హాఫ్ బాటిల్ మందు పంచుతున్నారని ఆరోపించారు. సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకుండా ఆ సమాచారంతో దొంగలను కాపాడుతున్నారన్నారు. తక్షణమే డబ్బు, మద్యం పంపిణీని నిలువరించకపోతే బీజేపీ కార్యకర్తలు కార్యాచరణకు సిద్ధమవుతారన్నారు. నియోజక వర్గం పరిధిలోని అనేక గ్రామాలు, మండలాల నుంచి బీజేపీ కార్యకర్తలు తనకు సమాచారం అందిస్తున్నారన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అడ్డదారుల్లో గెలువాలని చూస్తోందని విమర్శించారు. అధికారులు, పోలీసుల సహకారం లేకుండా ఇంటింటికి డబ్బులు పంపిణీ చేయడం సాధ్యమా అని ప్రశ్నించారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్న పార్టీలు, మద్యం పంపిణి చేస్తున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు డబ్బులకు అమ్ముడుపోయే వాళ్లు కాదనే సంగతి గుర్తుంచుకోవాలన్నారు.

వంద రోజుల్లోనే హామీల అమలు

ముస్తాబాద్, మే 12: వంద రోజుల్లోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని సిరిసిల్ల కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్‌లోని ఆయన నివాసంలో బీఎస్పీ యూత్ మండల అధ్యక్షుడు నవీన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో యారటి కరుణాకర్, అరుట్ల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే పేదలకు మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, రాగం కుమార్, కుడుకల మల్లేశం, ఉచ్చిడి బాల్‌రెడ్డి, కొండం రాజిరెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఎస్పీ నాయకులు

ఉర్సు ఉత్సవాలకు ఆహ్వానం



వినోద్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 12: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులో ఈ నెల 15న నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరు కావాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను నిర్వాహకుడు అజీజ్ ఆధ్వర్యంలోని ముస్లిం కమిటీ నాయకులు కోరారు. హరిదాస్‌నగర్‌లో ఆదివారం వినోద్‌కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో వినోద్‌కుమార్ పర్యటన నేపథ్యంలో నాయకులు హరిదాస్‌నగర్‌లో కలిశారు. అదేవిధంగా కరీంనగర్‌లో నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, వేములవాడలో డీఎస్పీ నాగేంద్రచారికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షాదుల్లా, లాల్‌మహ్మద్, హైమద్, జహంగీర్, ముజాఫర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సమాజంలో గుర్తింపు



విజేతలకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ఇల్లంతకుంట, మే 12: క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వైద్యులు రఘురాంరెడ్డి, శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాలిపెల్లి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌కు ఆదరణ ఉందన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతోపాటు దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడాకారులకు నేడు ఉపాధి అవకాశాలు మెరుగు అయ్యాయన్నారు. పోటీల్లో ముత్యంపేట జట్టు ప్రథమ, సంకెపెల్లి జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎలుక రామస్వామి, బద్దం మధు, ఎడ్ల ప్రశాంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, సంతోష్, దివాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బబ్లు, మధుసూదన్‌రెడ్డి, అర్జున్, రాము, లక్ష్మన్, ప్రదీప్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కొడిమ్యాల, మే 12 : మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం ఆదివారం ఆలయ కమిటీ, గ్రామ ప్రముఖులు, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుండి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం, హన్మాన్ చాలీసా పారాయణం, దండకం, చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పూజారి భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు, హన్మాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

మెట్‌పల్లి, మే, 12 : మెట్‌పల్లి అనుబంధ గ్రామమైనా వెంకట్రావుపేట గ్రామ శివారులోని పురాతన ఆలయం చిలుకల చిన్నమ్మ దేవాలయానికి నూతన అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకుడు పసునూరి శ్రీనివాస్ తెలిపారు. శనివారం జాతీయ రహదారి నుంచి ఆలయంకు వెళ్ళడానికి సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి పురాతనమైన ఆలయం అభివృద్ధి గురించి ఎవరు పట్టించుకోలేరని ఆవేదన వ్యక్తం చేశారు. మన పూర్వీకుల జ్ఞాపకాల గుర్తుగా ఆలయాన్ని సమిష్టిగా అభివృద్ధి పరుచుకోవడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తుల ప్రసాద్, కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, చాట్ల గణేష్, రాంపల్లి రఘుపతి, పోతు శ్రీనివాస్, బోడ్డు సుధాకర్, గంట ప్రవీణ్‌రావు, పసునూరి చిన్నయ్య, పిప్పెర శేఖర్, దొంతుల చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెగడపల్లి, మే 12: పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం 2010-11 సంవత్సరానికి చెందిన పదవతరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రామకృష్ణ విద్యాలయంలో 2010-11 సంవత్సరంలో పదో తరగతి చదివని విద్యార్థులందరు తమ కుటుంబసభ్యులతో సమావేశానికి హాజరయ్యారు. తమకు చదువులు నేర్పిన గురువులను సన్మానించి ఆత్మీయ సమ్మేళనాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎవరెవరు ఎక్కడ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నది ఒకరికొకరు తెలియజేసుకున్నారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర బలగాల పహారా

- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 12: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర పోలీసు బలగాలతో పహారా ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని కే కన్వెన్షన్ హాలులో ఎన్నికల బందోబస్తుకు వెళ్తున్న పోలీసు బలగాలకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్‌శాఖ తరపున ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఎన్నికలకు 1500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతీ మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో 57 ప్రత్యేక పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్స్, 13క్విక్ రియాక్షన్ టీమ్స్, 6 స్ట్రయికింగ్ ఫోర్స్, 2 స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్స్, కేంద్ర, ఇతర బలగాలు, ట్రైనీ కానిస్టేబుల్స్‌ను ఉపయోగిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు రూ. 82.11లక్షల నగదు, 9.209కిలోల గంజాయిని స్వాధీనం చేసుకు న్నామన్నారు. 1078మందిని బైండోవర్ చేశామని, 82 ఎన్‌బీడబ్ల్యూ ఎగ్జిక్యూట్ చేశామన్నారు. ఎన్నికల నియామవళి ఉల్లంఘనపై 16 కేసులు నమోదు చేశామన్నారు. జిల్లాలో 23 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 560 పోలింగ్ కేంద్రాల్లో 58 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎన్నికల కమిషన్ నియమావళిని పాటిస్తూ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కి సమాచారం అందించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడితే ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వేములవాడ టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వేములవాడ నియోజకవర్గంలో భారీ పోలీస్ బందోస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. వేములవాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదివారం పోలీస్ సిబ్బందికి విధులు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక కేంద్రాలపై నిఘాను ఏర్పాటు చేయాలని సూచించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రిని సంబంధిత అధికారులకు అందజేశారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లతో కూడిన సామగ్రిని అధికారులకు అందించడంతో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. డీఎస్పీ నాగేంద్రచారితో కలిసి ఎస్పీ అఖిల్‌మహాజన్ పరిశీలించారు.



హాజరైన పోలీసు బలగాలు